క్లుప్తంగా

సాంబయ్య మృతి తీరనిలోటు



ఆత్మకూరు : సీపీఐ మండల కార్యదర్శి అంబి సాంబయ్య మృతి పార్టీకి, పేదప్రజలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. ఈ మేరకు సాంబయ్య మృతదేహానికి ఆదివారం నివాళులర్పించారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలపై సాంబయ్య చేసిన పోరాటాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు శ్రీనివాస్, జిల్లా సహాయకార్యదర్శి భిక్షపతి, జిల్లా కార్యవర్గ సభ్యుడు భిక్షపతి, జిల్లా నాయకులు రవి, శంకర్‌నాయక్, నర్సయ్య, ఐలయ్య, రవి, రమేశ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



శాయంపేట : మండలంలోని ప్రగతి సింగారం గ్రామానికి చెందిన తాళ్ల భిక్షపతి అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు బోనపల్లి రఘుపతిరెడ్డి ఆదివారం పరామర్శించి రూ. 26వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఆయన వెంట పార్టీ గ్రామ అధ్యక్షుడు వైద్యుల ఆదిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ ఎలమంచ జయపాల్‌రెడ్డి, మత్స్యశాఖ డైరెక్టర్ నరేష్, నెక్ట్స్ జనరేషన్ యూత్ అధ్యక్షుడు సందీప్‌రెడ్డి, నాయకులు అశోక్, సంజీవయ్య, కట్టయ్య, రాజయ్య, రమేశ్, పైడి, రవి, అభిలాష్, సంతోష్, రవీందర్ ఉన్నారు.

గీతకార్మికుడికి గాయాలు



నడికూడ : తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారంలో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం గ్రామానికి చెందిన గట్టు మల్లయ్య (54) రోజు మాదిరిగానే కల్లు తీసేందుకు గ్రామ శివారులో గల తాటిచెట్టు ఎక్కుతున్నాడు. ఈ క్రమంలో కాలు జారి కిందపడగా తీవ్ర గాయాలు అయ్యాయి. గమనించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈనెల 4న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. డాక్టర్స్ కాలనీ, ప్రశాంత్‌నగర్ ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఎన్జీవోస్ కాలనీ -2, వెంకటేశ్వర కాలనీ, శ్యామల గార్డెన్, అమరావతి నగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 3గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు, గోపాల్‌పూర్ కల్లు మండువా, ఎఫ్‌సీఐ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, భీమారం రోడ్డు, అరుణోదయ కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, హనుమకొండ న్యూ బస్‌స్టేషన్ రోడ్డు, చౌరస్తా మెయిన్ రోడ్డు, టైలర్స్ స్ట్రీట్, గాంధీనగర్, కాకాజీ కాలనీ, కాంగ్రెస్ భవన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10 గంటల వరకు, ఫాతిమానగర్, అఫ్జల్‌నగర్, దర్గా ప్రాంతంలో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో వివరించారు. వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. శివనగర్, ఏఎస్‌రెడ్డి నగర్, మామునూరు మెయిన్ రోడ్డు, పోలీసు స్టేషన్, మామునూర్ విలేజ్, డైరీఫాం ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో వినియోగదారులు సహకరించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు నవ్యశ్రీ ఎంపిక

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థిని నవ్యశ్రీ రాష్ట్రస్థాయి అండర్-14 ఖోఖో పోటీలకు ఎంపికైంది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో 68వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వి.రామకృష్ణారెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ గోగు నారాయణ తెలిపారు. ఈమేరకు పాఠశాల ప్రాంగణంలో నవ్యశ్రీని హెచ్‌ఎం రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయుల ఆదివారం అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబర్చాలని కోరారు.

తక్కువ ఖర్చు..ఎక్కువ ఉపయోగం

- పశుగ్రాసం సేకరణలో రైతన్నకు చేదోడుగా యంత్రాలు
- ఆసక్తి చూపుతున్న మండల ప్రజలు
- సబ్సిడీ ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి



గడ్డికట్టను కట్టి నేలపైకి విడిచిపెడుతున్న యంత్రం

ఎల్కతుర్తి : పశుపోషణకు గ్రాసాన్ని నిల్వ చేసేందుకు రైతులకు యంత్రాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. వరిగడ్డి కట్టలు కట్టే యంత్రాలు అందుబాటులోకి రావడంతో కూలీల కొరతను అధిగమించి ఎక్కువ విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నారు మండలంలోని రైతులు.

పని సులభం

గతంలో ఎకరా విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కుప్ప నూర్చడానికి సుమారుగా మూడువేల రూపాయల వరకు కూలీ ఖర్చు ఉండేది. వరికట్టలు కట్టే యంత్రాలు రావడం వలన కట్టకు రూ.30 చొప్పున ఒక్క రోజులో పది ఎకరాల విస్తీర్ణంలో పశుగ్రాసాన్ని కట్టలు కడుతున్నారు. దీంతో రైతులకు సమయం కలిసిరావడంతో పాటు ఖర్చు సైతం ఘననీయంగా తగ్గుతుంది. వీటితో పాటు ఒక్కసారిగా ట్రాక్టర్‌లో సుమారుగా ఐదెకరాల పశుగ్రాసాన్ని తరలించేందుకు వీలుగా ఉంటుంది. ఎండిన పశుగ్రాసాన్ని కేవలం ఎకరాకు ఒకే ట్రాక్టర్ ట్రిప్పులో నిల్వ చేసి తరలించేవారు. దీంతో ఖర్చు పెరుగగా కొందరు రైతులు పశువులను కూడా అమ్ముకున్న దాఖలాలు ఉన్నాయి. పశుగ్రాసం నిల్వ సామర్థ్యం పెరుగడంతో తిరిగి రైతులు పశుసంపదను పెంచుకునే ఆలోచన చేస్తున్నారు. ముల్కనూరు డెయిరీ సమీపంలోని భీమదేవరపల్లి, ధర్మసాగర్, వేలేరు మండలాల కిందఉన్న ఆయా గ్రామాల రైతులు ఎల్కతుర్తి మండలంలో ఉన్న ఎస్సారెస్పీ ఆయకట్టు కింద గల దండేపల్లి, వీరనారాయణపూర్, సూరారం, బావుపేట, తిమ్మాపూర్, కేశవాపూర్ గ్రామాల్లో వేల ఎకరాల్లో సాగు చేసిన పశుగ్రాసాన్ని రైతులు కొనుగోలు చేసి మెట్ట ప్రాంతం గ్రామాలకు ట్రాక్టర్లలో తరలించి నిల్వ చేసుకుంటున్నారు. అయితే ప్రభుత్వం ఈ యంత్రాలను సబ్సిడీపై అందిస్తే రైతులకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయని మండలంలోని పలువురు రైతులు కోరుతున్నారు. యంత్రాల పనితీరుపై అవగాహన కల్పించాలని కోరుతున్నారు. ప్రభుత్వం దృష్టి సారించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేస్తున్నారు.



గడ్డికట్టలు కడుతున్న యంత్రం

పనిభారం తగ్గింది

కోతలైన తరువాత కుప్పలేసేందుకు కూలీల ఖర్చు బాగా వచ్చేది. వరిగడ్డి కట్టలు కట్టే యంత్రం అందుబాటులోకి రావడంతో తక్కువ సమయంలో ఎక్కువ పశుగ్రాసాన్ని నిల్వ చేసుకుంటున్నాం. కట్టలు కట్టించడానికి డబ్బులు సైతం తక్కువగానే అవుతున్నాయి. యంత్రాలు అందుబాటులోకి రావడంతో పనిభారం తగ్గింది. వీటి వినియోగంపై అవగాహన కల్పించాలి.

-ఎస్. రాజేందర్, రైతు

కూలీల కొరత తప్పింది

వరికట్టలు కట్టే యంత్రం రావడం వలన కూలీల కొరత తప్పింది. ఈ విషన్ తక్కువ సమయంలో ఎక్కువ కట్టలు కడుతుంది. కట్టిన కట్టలు నిల్వ చేసేందుకు తరలించడం సులువుగా మారింది. ప్రభుత్వం ఈ యంత్రాలకు రాయితీ కల్పిస్తే రైతులకు మరింత సులభంగా ఉంటుంది. పశుగ్రాసం కోసం ఈ యంత్రం చాలా బాగా పనిచేస్తుంది.

- సుధాకర్, రైతు, ఎల్కతుర్తి

ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూడాలి

- డీఆర్డీఓ నాగపద్మజ

ఎల్కతుర్తి : మండలంలోని రైతులు ధాన్యంలో 17శాతం తేమ ఉండేలా చూసుకోవాలని డీఆర్డీఓ నాగపద్మజ అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ఆమె సందర్శించారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. జిల్లాలో మొట్టమొదటి సారిగా కాలిపర్స్ కొలమానం ద్వారా సన్నరకం ధన్యానికి గ్రేడింగ్ విధానాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రంలో అన్ని సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులను ఆదేశించారు. అవకతవకలకు తావివ్వకుండా కొనుగోళ్లు చేయాలని అన్నారు.



ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన డీఆర్డీఓ నాగపద్మజ

ఆమె వెంట డీపీఎం ప్రకాశ్, ఏపీఎం రవీందర్, ఏఈఓ పున్నంచందర్, సీసీ రవీందర్, కమిటీ సభ్యులు రైతులు పాల్గొన్నారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలి

కమలాపూర్ : కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యమకారులకు ఇచ్చిన గ్యారంటీని వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమ కమిటీ ఫోరం మండల అధ్యక్షుడు మాటం సంపత్ ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన మండలస్థాయి ఉద్యమకారుల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అనేక ఆటుపోట్లను ఎదుర్కొని కుల, మత, పార్టీలకు అతీతంగా ప్రత్యేక రాష్ట్ర సాధనే ఏకైక ధ్యేయంగా పోరాటం చేశామని గుర్తు చేశారు. కేసుల పాలై జైళ్లకు వెళ్లి కోర్టుల చుట్టూ తిరిగామన్నారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలో ఉద్యమకారులకు అవకాశమిచ్చి గుర్తించిందని, వాటిని త్వరగా నెరవేర్చాలని అన్నారు. అదేవిధంగా ఈనెల 9న మరోసారి సమావేశమై ఉద్యమకారుల కార్యాచరణను ప్రకటిస్తామని, నూతన కమిటీని ఎన్నుకుంటామని తెలిపారు. సంపత్‌రావు, ప్రసాద్, శోభన్‌బాబు, సాంబయ్య, రమేశ్, సదానందం, ఓదెలు, సారయ్య, కుమారస్వామి, రవి, రాజేందర్, శ్రీనివాస్, పోచాలు, లక్ష్మీనారాయణ, అశోక్, ప్రసాద్, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న తెలంగాణ ఉద్యమకారులు

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



అప్పటి ఉపాధ్యాయులతో పూర్వవిద్యార్థుల బృందం

ఆత్మకూరు : మండలంలోని నీరుకుళ్లలో గల పద్మ హైస్కూల్‌లో 2003-2004 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి పూర్వవిద్యార్థులు ఆదివారం స్థానిక చెన్నకేశవస్వామి ఆలయ ప్రాంగణంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. పూర్వ విద్యార్థులు బాల్య స్మృతులను నెమరువేసుకున్నారు. చాలాకాలం తరువాత కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల అధినేత పరిటాల బాలకృష్ణమూర్తి, అప్పటి ఉపాధ్యాయులు పెరుమాండ్ల కిశోర్‌కుమార్, భీమ్‌రావు, పోతరాజు రాజేందర్, రవికుమార్, జమాండ్ల అశోక్, రమేశ్, మాస్కుల రాజేంద్రప్రసాద్, ప్రసాద్, తిరుపతిరెడ్డి, రమణారెడ్డి, రాజును పూర్వవిద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఆర్గనైజర్లుగా జనగాం రంజిత్, దేవా ప్రత్యూష వ్యవహరించారు.

ఫౌంటెయిన్‌ను తలపిస్తున్న దేవాదుల నీరు

శాయంపేట : మండలంలోని జోగంపల్లి శివారులో గల చలివాగు ప్రాజెక్టు నుంచి ధర్మసాగర్‌కు వెళ్లే దేవాదుల పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీక్ అవడంతో నీరు ఎగిసిపడుతూ ఫౌంటెయిన్‌ను తలపిస్తోంది. మైలారం నుంచి సున్నపురాళ్ల గడ్డ మీదుగా పెద్ద కోడెపాకకు వెళ్లే దారిలో శనివారం రాత్రి పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీకై 100 మీటర్ల ఎత్తుతో నీరు ఎగిసి పడుతుంది. అయితే పక్కనే 220 విద్యుత్ లైన్లపై నీరు పడుతుండడంతో ప్రమాదం పొంచి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. లీకేజీ నీటితో చుట్టుపక్కల పొలాలన్నీ నీటితో నిండిపోయాయి. మూడు నెలల క్రితం వరి పంట సాగు చేశామని, కోతలు కోసే తరుణంలో పైప్‌లైన్ ఎయిర్ వాల్వ్ లీకేజీ అవడంతో పొలాలు నీటితో నిండిపోయి హార్వెస్టర్‌తో కోతలు కోసే పరిస్థితి లేదని రైతులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లీకేజీకి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



ఎగిసిపడుతున్న దేవాదుల నీరు

అర్హులకు రేషన్ కార్డులు జారీ చేయాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాస్

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరమ్మ ఇళ్ల మంజూరును అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందించిన తరువాతే ప్రక్రియ ప్రారంభించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరులతో మాట్లాడారు. చాలాకాలంగా రేషన్ కార్డుల జారీ నిలిచిపోయిందన్నారు. తద్వారా ఇళ్లులేని నిరుపేదలకు సొంతింటి కల నెరవేరలేదన్నారు. ఈనెల 6 నుంచి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభిస్తామని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారని, లబ్ధిదారుల ఎంపికలో రేషన్‌కార్డు ప్రమాణికం కాదని తెలిపినా క్షేత్రస్థాయిలో నిరుపేదలకు ఇబ్బందులు తప్పవని అన్నారు. రేషన్‌కార్డులు లేదా డిజిటల్ కార్డులు అందించిన తర్వాతే లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని కోరారు.

అభివృద్ధిపై తప్పుడు ప్రచారం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

పరకాల: కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతి, మరెన్నో అక్రమాలను కప్పిపుచ్చుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై బీఆర్‌ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. టీపీసీసీ పిలుపు మేరకు తెలంగాణ రాష్ట్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వేపై పరకాల, నడికూడ మండల కార్యకర్తలతో ఆదివారం పరకాలలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విస్తృత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణ, మాజీ ఎంపీపీలు టి.స్వర్ణలత, పాడి కల్పనదేవి, కాంగ్రెస్ పార్టీ పరకాల మండల, పట్టణ అధ్యక్షులు కట్కూరి దేవేందర్‌రెడ్డి, కొయ్యడ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి..

ఆత్మకూరు: గ్రామాల్లో ఈనెల 6 నుంచి చేపట్టనున్న ప్రతిష్టాత్మక సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన ఆత్మకూరు, దామెర మండలాల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కమలాపురం రమేశ్, నాయకులు బీరం సుధాకర్‌రెడ్డి, పరికిరాల వాసు, ఏరుకొండ రవీందర్‌గౌడ్, రాజు, జయపాల్‌రెడ్డి, అలువాల రవి, రవీందర్, బాబుమియా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

ప్రజాపాలన పేరుతో ప్రతీకార పాలన

హన్మకొండ: ప్రజాపాలన పేరుతో రాష్ట్రంలో సీఎం రేవంత్ సర్కార్ ప్రతీకార పాలన సాగిస్తోందని బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ ఆరోపించారు. హనుమకొండ వడ్డేపల్లిలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఆదివారం మాట్లాడారు. అమలు సాధ్యం కాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. 11 నెలలవుతున్నా ఏ ఒక్క హామీని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని అన్నారు. ఆటో కార్మికులను ఆదుకుంటామని ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొని ఇప్పుడు వారిని పట్టించుకోవడం లేదని వాపోయారు. ఈ క్రమంలో ఈనెల 5వ తేదీన హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద మహాధర్నా కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మన తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు ఈసంపల్లి సంజీవ, మడికొండ బాబు, ఆటో యూనియన్ల నాయకులు జయరాం, నబీ, రాంచందర్, నర్సింగ్, నరహరి, కుమారస్వామి, రమేష్, వెంకటస్వామి, సాయిలు, పరశురాములుతో పాటు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి చొరవ చూపండి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండ బాలసముద్రంలోని డీఎస్ఏ స్విమ్మింగ్‌పూల్ అభివృద్ధికి చొరవ చూపాలని కాకతీయ స్విమ్మర్స్ అసోసియేషన్ బాధ్యులు కోరారు. ఈమేరకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేఅండ్‌ప్లే పద్ధతిలో క్రీడాకారుల నుంచి వసూలు చేస్తున్న ఫీజు లక్షల రూపాయలు ఉన్నప్పటికీ కనీస మరమ్మతులకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. పూల్‌లో నీటి శుద్ధీకరణ సరిగా లేకపోవడంతో క్రీడాకారులు అనారోగ్యం బారిన పడుతున్నారని తెలిపారు. మెయిన్ గేట్ వద్ద నీరు నిలిచి బురద పేరుకుపోతోందని, పరిసర ప్రాంతాలు సైతం అపరిశుభ్రంగా ఉన్నాయని అన్నారు. ప్రత్యేక శ్రద్ధ చూపి స్విమ్మింగ్‌పూల్‌ను అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యేను వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో అసోసియేషన్ అధ్యక్షుడు ప్రవీణ్‌సింగ్ ఠాకూర్, బాధ్యులు కృష్ణమాచారి పాల్గొన్నారు.

కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

హన్మకొండ: కాలనీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు హనుమకొండ శ్రీనగర్ కాలనీ (సౌత్) అభివృద్ధి సొసైటీ అధ్యక్షుడు మందల రవీందర్ రెడ్డి తెలిపారు. హనుమకొండ శ్రీనగర్ కాలనీలో కాలనీ అభివృద్ధి సొసైటీ సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలను ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి ఒక్కొక్కటిగా పరిష్కరించినట్లు వివరించారు. గత రెండు సంవత్సరాల్లో సొసైటీ ద్వారా చేపట్టిన కార్యక్రమాలపై సమీక్షించారు. అనంతరం రెండేళ్ల కాలానికి నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మందల రవీందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఏడిద అనిల్‌కుమార్, ప్రధాన సలహాదారుడిగా బండి నారాయణ, ఉపాధ్యక్షుడిగా దేవిరెడ్డి, మాలకొండా రెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా ముత్యాల కుమారస్వామి, వీరభద్రయ్య, ఆర్థిక కార్యదర్శిగా హింగె మనోహర్ రావు, కార్యవర్గ సభ్యులుగా ముక్యాల రాహుల్, డి.రాజ్‌కుమార్, జి.నరేందర్, ఎం.చంద్రమౌళి, బి.ప్రసాద్, వై.నరేందర్, ఎ.శివరామకృష్ణ ఎన్నికయ్యారు. సమావేశంలో కమిటీ సభ్యుల సందెల సత్యనారాయణ, సురేందర్ రెడ్డి, పాల్గొన్నారు.

సమష్టి కృషితో నరకాసుర వధ విజయవంతం

ఖిలా వరంగల్: అధికారులు, దాతల సమష్టి సహకారంతో వరంగల్ ఉర్సుగుట్ట మైదానంలో గత నెల 30న జరిగిన నరకాసుర వధ కార్యక్రమం విజయవంతమైందని ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, కార్పొరేటర్ మరుపల్లి రవి తెలిపారు. వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లో నరకాసుర వధ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కొండా సురేఖ, నగర మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ కలెక్టర్ సత్యశారద, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, సీపీ అంబర్ కిషోర్ ఝా, అన్ని శాఖల అధికారుల సహకారంతో నరకాసుర వధ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదానికి గురైన ఓ యువకుడు ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు ఇన్‌స్పెక్టర్ వెంకటరత్నం తెలిపారు. హనుమకొండ హసన్‌పర్తి గ్రామానికి చెందిన నారగోని స్వర్ణలత, ఉపేందర్ దంపతుల కుమారుడు నారగోని దీపక్ (22) అక్టోబర్ 16న మధ్యాహ్నం బైక్‌పై మధ్యకోటలోని నాన్నమ్మ ఇంటిలోని ఫంక్షన్‌కు బయల్దేరాడు. ఈక్రమంలో మధ్యకోట శిల్పాల తోరణం సమీపంలోని మూలమలుపు వద్దకు బైక్ చేరుకోగానే ఒక్కసారి బైక్ అదుపు తప్పి చెట్టును బైక్ ఢీకొనడంతో దీపక్ తలకు తీవ్రగాయాలయ్యాయి. హుటాహుటిన వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ ఆదివారం ఉదయం మృతిచెందాడు.

దేవాలయ భూమిని కాపాడాలి



కాశిబుగ్గ: గ్రేటర్ వరంగల్ 20వ డివిజన్‌లోని కాశీ విశ్వేశ్వర రంగనాథస్వామి దేవాలయ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడాలని కాశీ విశ్వేశ్వర, రంగనాథ ఆలయాల పరిరక్షణ, డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు కోరారు. ఈమేరకు కాశిబుగ్గలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. దేవాలయానికి చెందిన 28 గుంటల భూమి అన్యాక్రాంతం కాగా, కబ్జాదారులపై కోర్టులో కేసు వేసి గెలుపొందినట్లు తెలిపారు. దయాకర్, రాజ్‌కుమార్, సాంబయ్య, లక్ష్మీనారాయణ, సుధాకర్ పాల్గొన్నారు.

ముగ్గుల శోభారాణి కన్నుమూత

- పరకాలలో విషాదఛాయలు



శోభారాణి (ఫైల్)

పరకాల : నూతన సంవత్సరం, సంక్రాంతి పర్వదినం, దేశభక్తి, తెలంగాణ, తెలుగు పండుగల సంస్కృతికి అద్దం పట్టే విధంగా రంగురంగుల ముగ్గులు, బతుకమ్మలతో ఆకట్టుకుని ముగ్గుల రాణిగా పేరుతెచ్చుకున్న ఎల్లంకి శోభారాణి(52) శనివారం ఆకస్మికంగా మృతిచెందింది. ప్రముఖ బట్టల వ్యాపారి ఎల్లంకి వీరేషం సతీమణి శోభారాణి అనారోగ్యంతో బాధపడుతూ తుదిశ్వాస విడిచారు. ఆమె మృతిచెందినట్లు తెలిసిన స్థానిక వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు, ప్రముఖులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మృతదేహానికి నివాళులర్పించారు.



అంతిమయాత్రలో పాల్గొన్న నాయకులు రామకృష్ణ, తదితరులు

వివిధ ఉత్సవాల్లో ముగ్గులు వేసి అందరి మన్ననలు పొందే శోభారాణి మృతి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే మొలుగూరి భిక్షపతి, మున్సిపల్ చైర్‌పర్సన్ సోదా అనిత రామకృష్ణతో పాటు పలువురు విచారణ వ్యక్తం చేశారు. సంతాపసూచకంగా స్థానిక బట్టల వ్యాపారస్తులు దుకాణాలను మూసివేశారు.

కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలి

- ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ

కమలాపూర్ : ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుందని, కష్టాలను ధైర్యంగా ఎదుర్కోవాలని ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ అన్నారు. మండల కేంద్రంలోని గుడిబండ వద్ద ఆదివారం రాత్రి పోలీస్ కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నచిన్న కష్టాలకు కృంగిపోయి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడి తమ పిల్లలను అనాధలుగా మార్చొద్దన్నారు. ఇటీవల కాలంలో సైబర్ నేరాలు పెరిగిపోయాయని, అపరిచితుల నుంచి వస్తున్న కాల్స్ లిఫ్ట్ చేయవద్దని, ముఖ్యంగా తమ సెల్‌ఫోన్‌కు వచ్చిన ఓటీపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులకు చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కు కాల్ చేయాలని సూచించారు. సెల్‌ఫోన్‌ల వినియోగం పెరిగిపోయినందున ప్రస్తుత పరిస్థితుల్లో పిల్లల కదలికలపై తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. నవమాసాలు మోసి, కని, పెంచిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లోని యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మద్యం, గుట్కా, గంజాయి వంటి వ్యసనాల బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని యువకులకు సూచించారు. అలాగే నేరాల నియంత్రణ కోసం ప్రతిఒక్కరూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అంతకుముందు పోలీస్ కళాకారులు నాటికల ద్వారా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కళాబృందం ఇన్‌చార్జ్ నాగమణి, సభ్యులు విలియమ్, రత్నయ్య, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్ రాజు, చిరంజీవి, స్థానిక పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ హరికృష్ణ